పల్లె చెంతకే అన్ని సేవలు


పట్లవీడు గ్రామ పంచాయతీ సచివాలయం


నాడు–నేడు నిధులతో ఆధునీకరించిన ఎంపీయూపీ పాఠశాల


ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

గత ప్రభుత్వం హయాంలో అభివృద్ధికి నోచుకోని పల్లెలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి బాట పట్టాయి. ఉన్న ఊళ్లోనే అన్ని సేవలు అందుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.2.34 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రజల వద్దకే పరిపాలన
- గ్రామ సచివాలయం ద్వారా అందుతున్న సేవలు
- రూ.2.83 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి


విలేజ్ క్లినిక్

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాలలోనే అన్ని రకాల సేవలందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రజలకు కావాల్సిన అన్ని రకాల సంక్షేమ పథకాలు ఇంటి వద్దే అందించేందుకు తీసుకున్న చర్యలు అమోఘమని ప్రజలు చర్చించుకుంటున్నారు. సీఎం జగన్ ఎప్పుడూ లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి, సిబ్బందిని ఏర్పాటు చేసి గ్రామంలో ఇంటి వద్దకే అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. పట్లవీడు గ్రామ పంచాయతీ పరిధిలోని పట్లవీడు, యర్రబాలెం, శివలింగాపురం గ్రామాలలో రూ.2.34 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి.

- అందులో రూ.45 లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం
- రూ.22 లక్షలతో విలేజ్ క్లినిక్
- నాడు నేడు ద్వారా రూ.22 లక్షలతో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆధునీకరణ
- రూ.10 లక్షలతో చౌడమ్మ దేవాలయం ప్రహరీ గోడ నిర్మాణం
- మరో రూ.10 లక్షలతో శివాలయం నిర్మాణం
- రూ.20 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు
- రూ.20 లక్షలతో బీసీ కాలనీలో సీసీ రోడ్డు
- రూ.10 లక్షలతో ముస్లిం బజారులో సీసీ రోడ్డు, రూ.3 లక్షలతో పీర్లచావిడి ఆధునీకరణ
- యర్రబాలెంలో.. రూ.50 లక్షలతో సీసీ రోడ్లు
- శివలింగాపురంలో.. రూ.10 లక్షలతో సీసీ రోడ్లు
- రూ.2 లక్షలతో చర్చి ఆధునీకరణ పనులు చేశారు.

గత ప్రభుత్వంలో గ్రామాలలో నామమాత్రంగా సీసీ రోడ్ల నిర్మాణాలు చేశారు. సీఎం జగన్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తయ్యాయి. మండాది నుంచి యర్రబాలెం వరకు రూ.2.83 కోట్లతో తారు రోడ్డు పనులు పూర్తయ్యాయి. గతంలో ఈ గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంది. గుంతలమయంగా ఉన్న రోడ్డుకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించటంతో ఎంతో సౌకర్యంగా ఉంది. పట్లవీడు పంచాయతీ పరిధిలో వైఎస్సార్ జలకళ ద్వారా 50 బోర్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 10 బోర్లు వేయటం జరిగింది.

గ్రామంలోనే అన్ని సౌకర్యాలు..



సీఎం జగన్ ప్రభుత్వం వచ్చాక మా గ్రామంలో అన్ని పథకాలు ఇళ్ల వద్దకే వచ్చి ఇస్తున్నారు. గతంలో మండలం చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు అన్ని సంక్షేమ పథకాలు ఇంటి వద్దనే అందుతుండటంతో సంతోషంగా ఉంది. సచివాలయంలో అన్ని రకాల పనులు సకాలంలో జరుగుతున్నాయి.

– మందా అన్నమేరి, పట్లవీడు

ఇలాంటి అభివృద్ధి గతంలో ఎన్నడూ లేదు...



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మా గ్రామంలో గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్, పాఠశాల అభివృద్ధి పనులు, దేవాలయాలకు ప్రహరీగోడ, మరమ్మతు పనులతో పాటు ఎస్సీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణాలు జరిగాయి. ముస్లింలకు పీర్లచావిడి నిర్మించారు.

– తిక్కా కాశీలింగయ్య, పట్లవీడు

వైఎస్సార్ జలకళ ద్వారా 50 బోర్లు మంజూరయ్యాయి...



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు వైఎస్సార్ జలకళ ద్వారా 50 బోర్లు మంజూరయ్యాయి. ఇందులో 10 బోర్లు వేశారు. వర్షాధారంపై పంటలు పండించుకునే రైతులకు వైఎస్సార్ జలకళ పథకం ఎంతో ఉపయోగంగా ఉంది. ప్రభుత్వమే రైతులకు ఉచితంగా బోర్లు వేయటంతో పాటు మోటారు, విద్యుత్ మీటర్, లైన్ ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రభుత్వంలో నాకు రైతు భరోసా వచ్చింది. రైతులు సంతోషంగా ఉన్నారు.

– ఉలవల సుభాని, రైతు, పట్లవీడు

రాజ్యాంగం ప్రకారం అందరూ సమానమే

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: భారత రాజ్యాంగం ప్రకారం హిందు, ముస్లిం, క్రిస్టియన్ అందరూ ఒక్కటేనని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని వైఎస్సార్‌సీపీ జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎండీ గఫార్ కార్యాలయంలో గురువారం పిడుగురాళ్ల పట్టణంలోని మసీదుల ఇమామ్‌లు, మౌజమ్‌లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయులు సమాజంలో సమానత్వంతో, అసమానతలు లేకుండా జీవిస్తున్నారని తెలిపారు. ముస్లింలు ఖురాన్‌ను, హిందువులు భగవద్గీతను, క్రిస్టియన్లు బైబిల్‌ను నమ్ముతారు. కానీ భారతీయులందరూ నమ్మి బతుకుతుంది రాజ్యాంగం ప్రకారం అన్నారు. తాను చిన్నప్పటి నుంచి రాజకీయాలు చూస్తున్నానని చెప్పారు. ఏ రాజకీయ పార్టీ నాయకులు అయినా ఎన్నికల ముందు అభివృద్ధి పనులు చేస్తామనడం చూశాం. కానీ ఇక్కడ మొట్టమొదటిగా బీజేపీ నాయకులు మాత్రం అధికారంలోకి వస్తే ముస్లింలకు ఉన్న 4 శాతం రిజర్వేషన్ తొలగిస్తామనడం ఎంతటి దుర్మార్గం అన్నారు. నేడు అటువంటి బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తులు పెట్టుకొని ముస్లింలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని తెలిపారు. రాజ్యాంగంలో అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించారు. అందుకు అనుగుణంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారు. అటువంటి రిజర్వేషన్ తొలగిస్తామంటే మనం ఊరుకుంటామా అని ప్రశ్నించారు. అటువంటి వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. గురజాల నియోజకవర్గంలో 4 వేల మంది ముస్లింలకు ఇంటి పట్టాలు అందించామన్నారు. రేపు ఇమామ్‌లు, మౌజమ్‌లకు కూడా ఇంటి పట్టాలు అందిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి కృషి చేసిందన్నారు. మొదటి నుంచి అంజాద్‌బాషాకు ఉపముఖ్యమంత్రిగా అవకాశం కల్పించింది మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. 4 శాతం రిజర్వేషన్ కావాలని ప్రతి ముస్లిం కోరుకుంటున్నారని ముస్లిం మతపెద్దలు ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, నరసరావుపేట ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను, గురజాలలో మీ బిడ్డ కాసు మహేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిలా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎండీ గఫార్, ముస్లిం నాయకుడు ఎండీ లతీఫ్, ఎండీ అలీం, ఎండీ బాబర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భవనాశి యల్లారావు, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ బచ్చా మేస్త్రీ, ముఫ్తీ మౌలానా అబ్దుల్ రహమాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్లు షేక్ సైదావలి, కరిముల్లా, జానీ, నాయకులు షేక్ బాషా, షేక్ మస్తాన్‌వలి, షేక్ జానీబాబు, ఇమామ్‌లు, మౌజమ్‌లు పాల్గొన్నారు.

గండ్లూరులో ‘కోడ్’ అమలులో నిర్లక్ష్యం



సత్తెనపల్లి: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చి గురువారం నాటికి 13 రోజులు గడుస్తున్నా మండలంలోని గండ్లూరు గ్రామంలో నిర్లక్ష్యం స్పష్టంగా నిపిస్తోంది. గ్రామంలోని వాటర్ ప్లాంటులో ఇప్పటికీ టీడీపీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఫొటో, స్టిక్కర్లు అతికించి స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా చూడాలని ప్రజల కోరుతున్నారు.

ఎండ్రాయిలో పోలీసు కవాతు

అమరావతి: మండల పరిధిలోని నరుకుళ్ళపాడు, ఎండ్రాయి గ్రామాల్లో గురువారం ఎన్నికలు విధులు నిర్వహించే ప్రత్యేక పోలీసు సిబ్బందితో సీఐ ఏవీ బ్రహ్మం పోలీసు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కవాతులో ఎస్ఐలు ఉన్నారు.

‘బీఎస్ఎన్ఎల్’ ఆస్తి పన్నుపై రూ.30లక్షల వడ్డీ రాయితీ

సత్తెనపల్లి: పుర ప్రజలు ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ భవనం ఆస్తి పన్ను బకాయి గురువారం చెల్లించి, రశీదు పొందారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఒకే సారి పన్ను బకాయి చెల్లింపుతో వడ్డీ రాయితీ పొందాలన్నారు. పట్టణ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు ఎన్నో ఏళ్లుగా ఆస్తి పన్ను చెల్లించకుండా మొండి బకాయిలుగా పేరుకుపోయాయన్నారు. వీటి పై ప్రత్యేక దృష్టి సారించి, పన్ను వసూలుకు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ భవనం 2010 నుంచి ఆస్తి పన్ను చెల్లించలేదన్నారు. మొత్తం రూ. 54,13,393లు బకాయి ఉందన్నారు. దీనిపై వడ్డీ రాయితీ రుసుం రూ.30,99,570 పోగా మిగిలిన రూ. 23,13,823లు నగదు చెల్లించినట్లు చెప్పారు. ఇలా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ సద్వినియోగం చేసుకోవడం వల్ల పట్టణ అభివృద్ధికి మేలు జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. మున్సిపల్ ఆర్వో అప్పారావు, ఆర్ఐ జానీ బాషా, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 20 కుటుంబాలు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై దాచేపల్లి పట్టణంలోని టీడీపీకి చెందిన 20 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో గురువారం చేరారు. పిడుగురాళ్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దాచేపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు కందూరి తిరుపతి రెడ్డి, మర్రిబోయిన మహేష్ బాబు, కొప్పుల కృష్ణల ఆధ్వర్యంలో, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జంగాల శ్రీను, అంబటి శ్రీను, జంగాల శ్రీనివాస్, జంగాల స్వామి, యలకా హనుమయ్య, మెట్టల పుల్లయ్య, సంకుల శ్రీను, కంపసాటి రమేష్, జంగాల శివ, జంగాల నాగరాజు తోపాటు పలువురు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలకు, పార్టీలకు అతీతంగా రాష్ట్రాన్ని పరిపాలించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అందుకే ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారని చెప్పారు. అన్ని వర్గాల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో కందూరి తిరుపతి రెడ్డి, మర్రిబోయిన మహేష్‌బాబు, కొప్పుల కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రేమ, సేవ కలయికే పవిత్ర గురువారం

ఫాదర్ వైఎల్ మర్రెడ్డి


శిష్యులకు కాళ్లు కడుగుతున్న విచారణ గురువులు రె.ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

రెంటచింతల: క్రీస్తు ఆరాధికులకు దివ్య సత్ప్రసాదాన్ని అందించడానికే యేసు ప్రభువు గురువులను స్థాపించారని..ప్రేమ సేవ కలయికే పవిత్ర గురువారమని కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అన్నారు. పవిత్ర గురువారం పురస్కరించుకుని స్థానిక కానుకమాత చర్చిలో నిర్వహించిన ప్రత్యేక దివ్యపూజాబలిని ఫాదర్ వైఎల్ మర్రెడ్డి సమర్పించి భక్తులనుద్దేసించి మాట్లాడారు. పాస్కా పండుగ క్రైస్తవ సోదరులకు ఎంతో ప్రముఖమైందన్నారు. యెహోవా ప్రభువు ఇశ్రాయేలు ప్రజలను బానిసత్వం నుంచి విముక్తులను చేసిన ఘటనను ఈ పాస్కా భోజనం ద్వారా స్మరించుకుంటారన్నారు. పాస్కా భోజనాన్ని కడరాత్రి భోజనంగా యేసు తన శిష్యులతో చివరిసారి చేశారన్నారు. ఈ కడరాత్రి భోజనం ద్వారా యేసు ప్రపంచ మానవాళికి సోదర ప్రేమ అనే నూతన ప్రేమ ఆజ్ఞ, దివ్య సత్ప్రసాదన స్థాపన, గురుత్వ స్థాపన అనే మూడు వరాలను ప్రసాదించారన్నారు. దివ్యపూజాబలి సమర్పించడం, విశ్వాసులకు దివ్య సత్ప్రసాదం ఇచ్చే అర్హత అభిషేకింపబడే ఒక్క గురువులకు మాత్రమే ఉంటుందన్నారు. యేసు ప్రభువు కడరాత్రి భోజన సమయంలో తన 12 మంది శిష్యులకు కాళ్లు కడిగి వారిని గురువులుగా అభిషేకించి అప్ప ద్రాక్ష రసాలను అందించి తనలాగే చేయమని గురుత్వ బాధ్యతలను ఇవ్వడం జరిగిందన్నారు. గురువులు యేసు ప్రభువు త్యాగనిరతిని ప్రతి దినం దివ్యపూజలో కొనియాడుతున్నారన్నారు. అప్పటి నుంచి గుడ్ ఫ్రైడే ముందు రోజు గురువులు 12 మంది శిష్యులకు పవిత్ర గురువారం రోజు కాళ్లు కడిగి స్మరించుకోవడం జరుగుతుందన్నారు. కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, వందలాది మంది భక్తులు ఈ ప్రత్యేక దివ్యపూజాబలిలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్యను పరిష్కరించండి



పిడుగురాళ్ల: పట్టణంలోని 25వ వార్డుకు చెందిన ముస్లిం మహిళలు తమ ప్రాంతంలో తాగునీటి సమస్యను తీర్చాలని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్‌కు సుమారు వంద మంది సంతకాలతో కూడిన వినతి పత్రం గురువారం అందించారు. ఎక్కువగా ముస్లింలు నివసించే ప్రాంతంలో ముస్లింలందరు రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాసాలు ఉంటున్నారు. అయితే నీటి ఎద్దడి ఉన్నందున వెంటనే తమ ప్రాంతంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కమిషనర్ నీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి తిరునాళ్ల



గురజాల : మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తల్లి తిరునాళ్ల వైభవంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచి బారులు తీరారు. పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లను పురస్కరించుకుని దేవాలయాన్ని రంగులతో తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



మాచర్ల రూరల్: భారత రాజ్యాంగం కల్పించిన ప్రధానమైన హక్కులలో ఓటు హక్కు కీలకమైందని ఈ ఓటు హక్కును, స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలీసు యంత్రాంగం మీకు అండగా ఉంటుందని రూరల్ ఎస్ఐ పి.రాజశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని కంభంపాడు గ్రామంలో పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని, గ్రామస్తులు ఎటువంటి ఒత్తిడులకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా గ్రూపులు, ముఠాలు కట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, పెద్దలతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడి పలు సూచనలు చేశారు.


ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు



పిడుగురాళ్ల: రానున్న 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలకు మేమున్నాం అనే మనోధైర్యాన్ని కల్పించేందుకు ఈ పోలీస్ కవాతు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని పలు కాలనీల్లో గురువారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు, గురజాల డీఎస్పీ పల్లపు రాజు సూచనలతో పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, గాంధీనగర్, బ్రహ్మానందరెడ్డి కాలనీ, శ్రీనివాస కాలనీ, రైల్వే మొండి గేట్, బెల్లంకొండ డొంక, క్రిస్టియన్ పేట, చెరువుకట్ట బజార్లలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ప్రజలకు మేమున్నామన్న భరోసా కల్పిస్తున్నామన్నారు. ప్రజలు ధైర్యంగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు కె.అమీర్, పఠాన్ రబ్బాని ఖాన్, ఏఎస్ఐలు శ్రీనివాసరావు, కొండలరావు, కేంద్ర పారా మిలటరీ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం



రెంటచింతల: స్థానిక సుబ్బన్నతోట కాలనీలో వేంచేసిన అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం 20వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతి శర్మ నేతృత్వంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవాచనము, కలశస్థాపన, కంకణధారణ, నవగ్రహ మండపారాధన, అఖండ దీపారాధన, పంచామృతాభిషేకం, 8.30 గంటలకు లక్ష్మీ గణపతి హోమాలు, 9.30 గంటలకు లక్ష తులసీదళార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు ఏర్పాటు చేసే బండి వేలంపాటను నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షులు నాళం పెద్దబాబు, దేవస్థానం పాలక వర్గం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



రెంటచింతల: మండల కేంద్రం రెంటచింతలలోని ఉట్లస్థంబాల సెంటర్లో యెనిగండ్ల బుచ్చయ్య చౌదరి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని శ్రీ రామకృష్ణ సేవా మండలి చైర్మన్ గుంటక కాశిరెడ్డి అన్నారు. గురువారం మండుతున్న వేసవిలో పాదచారులకు, రైతులకు దాహార్తిని తీర్చేందుకు రూ.60 వేల విలువైన ఫ్రిజ్‌ను ఏర్పాటు చేయగా కాశిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వివిధ పనుల నిమిత్తం పొలం వెళ్లిన కూలీలకు, రైతులకు, పలు పనులకు బయటకు వచ్చిన గ్రామస్తులకు దాహం తీర్చడానికి 60 రోజుల పాటు చల్లని మంచి నీటిని అందించాలనే ఆశయంతో బుచ్చయ్య చౌదరి కుటుంబ సభ్యులు ముందుకు రావడం ప్రసంశనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సేవా మండలి సభ్యులు బద్దిగం అప్పిరెడ్డి, పల్నాటి రాముడు, కె.సైదులు, అక్కులు, నారాయణ పాల్గొన్నారు.

జగనన్న కోసం నేను సైతం

వలంటీర్ బాధ్యతల నుంచి తప్పుకున్న దుర్గా విజయ్

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని 12వ వార్డుకి చెందిన వలంటీర్ కాకుమాను దుర్గా విజయ్ వలంటీర్ బాధ్యతలకు గురువారం రాజీనామా చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్వీ వెంకటరమణకు దుర్గా విజయ్ రాజీనామా పత్రాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్‌గా ప్రజలకు సేవ చేశానని, ప్రస్తుతం జగనన్న కోసం పనిచేయాలని వలంటీర్ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నానని దుర్గా విజయ్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

సత్తెనపల్లి: ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నారన్న ఆరోపణలపై 14వ సచివాలయం పరిధిలోని 11వ వార్డుకు చెందిన వేల్పుల అఖిల్, దర్శి కిరణ్‌కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.